Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 352 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 7 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

## - త్రివిధ దళాలు సహా వివిధ శాఖలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో నైరుతి రుతుపవన కాలంలో సంభవించే తుఫానులు, వరదలు వంటి ఎటువంటి విపత్తులనైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలతో సర్వసన్నద్ధమై ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. మాన్సూన్ సన్నద్ధతపై గురువారం సచివాలయం నుంచి ఆయన వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కోస్టు గార్డు, ఎన్డీఆర్ఎఫ్ తదితర కేంద్ర ప్రభుత్వ విభాగాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నైరుతి రుతుపవన కాలంలో ఎక్కడైనా అధిక వర్షాలు, వాగులు, వంకలు పొంగి వరదలు సంభ వించే పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉంటే, వాటిని ముందుగానే అంచనా వేయాలని ఇందుకు సంబంధించి వాసర్ ల్యాబ్స్‌తో సమన్వయం చేసుకోవాలని విపత్తుల నిర్వహణశాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎసలు, ఇస్రోతో కలిసి సమన్వయంతో పని చేయాలని సీఎస్ చెప్పారు.

# కస్టడీకి కాకాణి.. జైలులోనే వైద్య పరీక్షలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** క్వార్ట్జ్ అక్రమాల కేసులో జిల్లాలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈరోజు (శుక్రవారం) ఉదయం సీఐ సుబ్బారావు జిల్లా జైలుకు వెళ్లారు. జైలులోనే కాకాణికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మాజీ మంత్రిని కస్టడీలోకి తీసుకుంటున్న నేపథ్యంలో జైలు వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకాణిని జైలు నుంచి కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించే అవకాశం ఉంది. నేటి నుంచి మూడు రోజుల పాటు అంటే ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలు, భారీగా పేలుడు పదార్థాల వినియోగం, అట్రాసిటీ కేసులో కాకాణి ఏ4గా ఉన్నారు. ఈ కేసులో మరింత సమాచారం తెలుసుకునేందుకు కాకాణిని కస్టడీలోకి ఇవ్వాల్సిందిగా నెల్లూరు కోర్టులో పోలీసులు పిటిషన్ వేశారు. దీంతో కాకాణిని మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని కోర్టు షరతు విధించింది. క్వార్ట్జ్ అక్రమాలపై కేసు నమోదు అయిన తర్వాత దాదాపు రెండు నెలల పాటు పోలీసులకు చిక్కకుక్కుండా కాకాణి తప్పించుకుని తిరిగారు. ఈ క్రమంలో ఇటీవల బెంగళూరు శివారులో మాజీ మంత్రిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే విచారణ సమయంలో కూడా పోలీసులకు ఏమాత్రం సహకరించలేదు కాకాణి. ఈ కేసులో సాక్షులు చెప్పిన విషయాలను కాకాణి ముందు




ఉంచి ప్రశ్నించినప్పటికీ తనకు తెలియదు, సంబం ధం లేదు అంటూ సమాధానాలు ఇస్తూ పోలీసుల విచారణకు సహకరించలేదు. ఈ క్రమంలో మూడు రోజుల పాటు కాకాణి పోలీస్ కస్టడీలో ఉండబోతున్నారు. కాకాణి తరలించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. జైలు ప్రాంగణంతో పాటు కృష్ణపట్నం పోర్టు పోలీస్‌స్టేషన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు సెంట్రల్ జైలు వద్దకు భారీగా వైసీపీ నేతలు చేరుకున్నారు. దాదాపు 61వేల మెట్రిక్ టన్నుల క్వార్జ్‌ను ఆరు నెలల వ్యవధిలోనే తవ్వకాలు జరిపి ఇతర దేశాలకు తరలించారు. ఈ క్రమంలో క్వార్జ్‌ను తీసుకుని వెళ్లడంలో ఎవరెవరి పాత్ర ఉంది అనే అంశాలపై కాకాణిని పోలీసులు ప్రశ్నించనున్నారు.

# అంతా నిజమే చెబుతా.. ఈటెలతో కమిషన్ ప్రమాణం

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. ఈరోజు (శుక్రవారం) బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది.

అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమీషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. విచారణలో భాగంగా ఆర్థిక మంత్రిగా ఎంతకాలం పనిచేశారు అంటూ ఈటెలను కమిషన్ అడిగింది. అలాగే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం చేయాలని ఎవరు నిర్ణయం తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించింది. టెక్నికల్ టీం రిపోర్టుల ఆధారంగా సబ్ కమిటీ నిర్ణయం మేరకు.. కేబినెట్ నిర్ణయం తీసుకుందని సమాధానం ఇచ్చారు ఈటెల. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలు పెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

# పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవు


**అమరావతి, (రాజధాని వార్తలు):** పేదల పాలిట వరమైన ఆర్డీటీ సేవలు ఆగవని, కేంద్రంతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని ఏపీ విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. రాయలసీమతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతోనూ, సంబంధిత ఉన్నతాధికారుల తోనూ, సంస్థల తోనూ సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు**

విద్య, వైద్య, విజ్ఞాన, ఉపాధి వికాస రంగాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని మంత్రి లోటకేష్ తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలతోపాటు తెలంగాణలోని మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఈ సంస్థ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 3,500 గ్రామాల్లో ఆర్డీటీ సేవలు అమలవుతున్నాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలోని బత్తులపల్లి, అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600కుపైగా పడకలతో మూడు ఆసుపత్రులను ఆర్డీటీ నిర్వహిస్తోందన్నారు. ఏటా 8.5 లక్షల మంది అవుట్‌పేషెంట్లు, 60 వేలకుపైగా ఇన్‌పేషెంట్లకు సేవలు అందున్నాయన్నారు. కరోనా సమయంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసు పత్రిని కొవిడ్ సెంటర్‌గా మార్చగా.. పది వేల మందికి చికిత్స అందిందని గుర్తు చేశారు. అలాగే మూగ, చెవిటి, మానసిక వికలాం గులైన విద్యార్థులకు అనంతపురంలో మూడు ప్రాథమిక, రెండు ఉన్నత పాఠశాలలను ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు.




# చీనాబ్ రైల్వే బ్రిడ్జ్‌పై సీఎం చంద్రబాబు ట్వీట్



**అమరావతి, (రాజధాని వార్తలు):** జమ్మూకశ్మీర్‌లో చీనాబ్ నదిపై నిర్మితమైన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈరోజు (శుక్రవారం) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి చీనాబ్ రైల్వే వంతెనను ప్రారంభించారు. తాజాగా చీనాబ్ రైల్వే బ్రిడ్జ్ ప్రారంభోత్సవంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా కొత్త రైల్వే బ్రిడ్జ్ నిర్మాణంపై ప్రధానికి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రధాని నాయకత్వంలో కొత్త దశ మొదలైందని.. చీనాబ్ రైలు వంతెన ప్రపంచంలోనే ఎత్తైనదంటూ ముఖ్య మంత్రి కొనియాడారు.

**చంద్రబాబు ట్వీట్**

జమ్మూకాశ్మీర్ అభివృద్ధిలో నూతన అధ్యాయం, ప్రధాని మోడీ నాయకత్వంలో కొత్త దశ మొదలైంది. క్లిష్టమైన భౌగోళిక పరిస్థితుల్లో నిర్మించబడిన అద్భుత నిర్మాణ శైలికి నిదర్శనంగా ఈ కట్టడం నిలుస్తుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైలు వంతెన.. చీనాబ్ రైలు వంతెన.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైలు ఆర్చ్ వంతెనగా గుర్తింపు. భారతదేశంలోనే తొలి కేబుల్-స్టేయిడ్ రైలు వంతెన. అంజి బ్రిడ్జ్ భారతదేశపు మొట్టమొదటి కేబుల్ స్టేయిడ్ రైలు వం తెనగా నిలుస్తుంది. ఉధంపూర్ – శ్రీనగర్ – బారాముల్లా రైల్వే ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ధార్మిక పర్యాటకానికి బలం చేకూర నుంది. ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. ఏ కాలానికైనా అనుకూలమైన రవాణా వ్యవస్థతో వందే భారత్ రైలు.. మాతా వైష్ణవి దేవి కట్రా – శ్రీనగర్ మధ్య నడవనుంది. ఈ నిర్మాణాలు దేశ గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయి' అంటూ సీఎం చంద్రబాబు ట్విట్ చేశారు.

# 5,000 దాటిన కొవిడ్ కేసులు.. ఆరోగ్య శాఖ ఏమి చెప్పిందంటే...

**న్యూఢిల్లీ:** దేశంలో కొవిడ్ కేసుల సంఖ్య 5,000 దాటిందని, కేరళపై ఈ ప్రభావం ఎక్కువగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం నాడు తెలిపింది. ఒకే రోజులో సుమారు 500 కేసులు పెరగడంతో మొత్తం కేసుల సంఖ్య 5,364కు చేరినట్టు వెల్లడిం చింది. గత 24 గంటల్లో నలుగురు మృతి చెందినట్టు పేర్కొంది. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, అత్యధికంగా కేరళలో 1,679 కేసులు నమోదు కాగా, ఆ తర్వాత స్థానంలో గుజరాత్ (615), పశ్చిమ బెంగాల్ (596), ఢిల్లీ (592) ఉన్నాయి. గత 24 గంటల్లో కేరళలో ఇద్దరు మరణించగా.. కర్ణాటక, పంజాబ్‌లలో ఒకరి చొప్పున మృతి చెందారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాలూ ఆక్సిజన్, ఐసొలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది. చాలా కేసుల్లో తీవ్రత చాలా తక్కువగానే ఉందని, ఇళ్లలో జాగ్రత్తలు తీసుకుని తగ్గించుకోవచ్చని తెలిపింది. అయితే కేసులు పెరిగితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కోరింది. కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఫెసిలిటీ-లెవల్ ప్రిపేర్డ్‌నెస్ కోసం కేంద్రం మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి 4,727 కేసులు రిపోర్ట్ కాగా, 55 మరణాలు సంభవించినట్టు అధికారులు ధ్రువీకరించారు.



మే 22 నుంచి దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 257గా ఉంది. కొవిడ్ పరిస్థితి, సన్నద్ధత కోసం తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో జూన్ 2, 3 తేదీల్లో డీజీహెచ్ఎస్ డైరెక్టర్ డాక్టర్ సునీత శర్మ అధ్యక్షత సాంకేతిక సమీక్షా సమావేశం జరిగింది. డిజాస్టర్ మేనేజిమెంట్ సెల్, ఈఎంఆర్ సెల్, ఎన్సీడీసీ, ఐసీఎంఆర్, ఐడీఎస్‌పీ, ఢిల్లీ సెంట్రల్ గవర్నమెంట్ ఆసుపత్రుల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# కొబ్బరి, పొగాకు పంటలకూ బీమా



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని కొబ్బరి, పొగాకు రైతులకు ఈ ఏడాది నుంచి పంటల బీమా వర్తించనున్నది. గతేడాది మామిడిని పంటల బీమాలోకి చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్రం ప్రతిపాదనతో ఇప్పుడు కొబ్బరి, పొగాకును కూడా పంటల బీమా పరిధిలోకి తెచ్చింది. పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమాలో ఈ పంటలను చేర్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖతో ఎంపానల్ అయిన రాష్ట్ర వ్యవసాయ శాఖ కొబ్బరి, పొగాకు పంటలకు బీమా అమలుకు టెండర్లు పిలిచింది. శుక్రవారం బిడ్లను ఖరారు చేయనున్నది. ప్రభుత్వ ఆమోదంతో అవార్డు నోటీసు జారీ చేయనున్నది. కొబ్బరి బీమా వర్తింపజేయడానికి 2025 ఖరీఫ్‌లో ఏడు జిల్లాల్లోని మూడు క్లస్టర్లు, పొగాకు(ఎఫసీవీ)కు 2025-26 రబీలో ఆరు జిల్లాల్లోని మూడు క్లస్టర్లను అర్హత ప్రాంతంగా గుర్తిం చింది. బీమా ప్రయోజనాల కోసం నోటిఫైడ్ ఏరియాల్లోని రైతులు, కౌలు సాగుదారులు వివరాలు నమోదు చేసుకోవాలి. ప్రీమియంలో తన వాటాను రైతు చెల్లిస్తే.. సబ్సిడీ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి.

# ఘనంగా వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడలోని స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు గత 33 రోజులుగా నిర్వహించుచున్న వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడినది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాయింట్ కలెక్టర్ & పర్సన్ ఇన్‌ఛార్జ్ రాహుల్ మీనా, ఐఏఎస్ వారు మాట్లాడుతూ చిన్న తనం నుండి పుస్తక పఠనం, గ్రంథాలయ సందర్శన చేయుట వలన రాబోయే కాలంలో ఉన్నత స్థానాలలో ఉండవచ్చునని, అయన రాజస్థాన్ స్వస్థలమైన ఇక్కడి వచ్చి తెలుగు నేర్చుకొని స్పష్టంగా మాట్లాడటం నేర్చుకోవటం అంత చదువు మీద ఇష్టంతోనే జరిగిందని, నేను ఇప్పటికి విద్యార్థిగానే ఉన్నానన్నారు. ప్రజల ఉపయోగార్థం అన్నిరకాల పుస్తకాలను ఒకేచోట చేర్చి రక్షించే ప్రదేశాన్ని గ్రంథాలయం అని అంటారని, గ్రంథాలయం అనగానే అందరికి గుర్తుకువచ్చేది ఒక్కటే, అక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయి అని, చిన్నపిల్లల నుండి పెద్దవారి దాకా అందరికి అవసరమైన బుక్స్ ఒక గ్రంథాలయంలోనే ఉంటాయని, ఇక్కడ చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఏ వ్యక్తి అయిన ప్రవేశించి వారికి కావాల్సిన పుస్తకాలు తీసుకొని చదువుకోవచ్చునని, పాఠశాలలకు వెళ్ళే పిల్లలు వారి వేసవి సెలవులను గ్రంథాలయంలో విజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు వినియోగించుకొనుట చాల సంతోషంగా ఉందన్నారు. మనిషి సంపదను దాచుకోగలడేమో గానీ, జ్ఞానాన్ని దాచిపెట్టలేడని, తాను కనుక్కున్నదీ, అనుభవించిందీ, ఆలోచించిందీ ఎదుటివారితో పంచుకోవాలనే తపనే భాష మరియు లిపిల పుట్టుకలకు కారణమని, రాసిన అన్నింటినీ నిర్దేశిత స్థలంలో అందరికీ అందుబాటులో ఉంచాలనే ప్రాథమిక భావనే గ్రంథాలయాలకు మూలమన్నారు. సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి పాలంకి నాగరాజు మాట్లాడుతూ, గ్రంథాలయాలు-జ్ఞానానికి వేదికలని, గ్రంథ పఠనం అజ్ఞాన హరణమని, గ్రంథాలయాలు ఇలలో కొలువైన దేవాలయాలని, విద్య అజ్ఞానంపై సంధించిన వజ్రాయుధమైతే, అజ్ఞాన గాడాంధకారాన్ని తొలగించే అక్షర హారం పుస్తకమని, అక్షరజ్ఞానం, పుస్తక జ్ఞానం లేని మానవ జన్మ నిరర్థకమన్నారు. అనంతరం ఈ 33 రోజులు వచ్చిన విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ అండ్ పేపర్ క్రాఫ్ట్ పై శిక్షణ ఇచ్చిన శ్రీ బి.సూర్యనారాయణ రిటైర్డ్ టీచర్ వారిని, ట్రైనర్ సాఫ్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చిన ఎం.సత్య బాల డి.ఆర్.డి.ఎ. వారిని, మ్యూజికల్ అండ్ మోరల్ స్టోరీస్ పై శిక్షణ ఇచ్చిన టి.ఎస్.లక్ష్మీ కుమారి రిటైర్డ్ టీచర్ వారిని, జి.కె. అండ్ జనరల్ అవేర్‌నెస్‌పై శిక్షణ ఇచ్చిన పి.సోమన్న చౌదరి రిటైర్డ్ టీచర్ వారిని, డ్రాయింగ్ పై శిక్షణ ఇచ్చిన ఎం.చినబాబు టీచర్ వారిని, పప్పెట్ షో పై శిక్షణ ఇచ్చిన పి.గోవిందరాజులు టీచర్ వారిని, మాజిక్ అండ్ సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్ వి.ఎస్.వి. రమణ మూర్తి టీచర్ వారిని, ఎన్విరాన్‌మెంట్ సైన్స్ పై శిక్షణ ఇచ్చిన కె.శ్రీనివాసరావు టీచర్ వారిని, యోగా మరియు మోరల్ స్టోరీస్ పై శిక్షణ ఇచ్చిన జి.సత్యవతి టీచర్ వారిని దుశ్శాలువతో సత్కరించి మెమోంటోలు అందించుట జరిగినది. అనంతరం ఈ 33 రోజులు వేసవి విజ్ఞాన శిబిరాలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు మెమోంటోలు మరియు ప్రశంసాపత్రాలను అందించుట జరిగినది. ఇంచార్జ్ ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్ వందన సమర్పణతో గత 43 రోజుల నుండి జరుగుచున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఎమ్.శ్రావ్య, టి.సాయి వెంకట్రావు, రికార్డు అసిస్టెంట్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది డి.రవి కుమార్, రికార్డు అసిస్టెంట్, ఎస్.రాజు, రికార్డు అసిస్టెంట్, టి.వీర్రాజు, రికార్డు అసిస్టెంట్, జి.దుర్గాప్రసాద్, రికార్డు అసిస్టెంట్, కె.ప్రియదర్శిని, రికార్డు అసిస్టెంట్ మరియు ఎ.వి.ఎస్.నాగేంద్ర, ఆ.సో. లైబ్రరియన్ మరియు అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు మరియు వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు.






# అపోలో హాస్పిటల్స్ కాకినాడలో అరుదైన శస్త్రచికిత్స

## - చేప ముల్లు గుండె వద్ద ఇరుక్కున్న మహిళ ప్రాణాన్ని కాపాడిన వైద్యులు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించి ఒక మహిళ ప్రాణాన్ని కాపాడారు. సుమారు నాలుగు గంటలపాటు వైద్యులంతా శ్రమించి విజయవంతంగా ఒక ప్రాణాన్ని కాపాడారు. అన్నవాహిక నుండి చొచ్చుకుని గుండె పెద్ద సరంలోనికి చొచ్చుకున్న చేప ముల్లును తీశారు. ఈ విధంగా బహుశా జాతీయ స్థాయిలో ఈ తరహా కేసులు రెండు మూడు కంటే ఎక్కువ ఉండవని ఆ వైద్యులు తమ అభిప్రాయాలను గురువారం అపోలో ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సంవత్సరం చికిత్స సంబంధించి వైద్యులు వై శివరామకృష్ణ. పి నాగేశ్వరరావు, జి వంశీ చైతన్యలు వివరించారు. బిక్కవోలుకు చెందిన 54 ఏళ్ల జంపా మంగయ్యమ్మకి అన్నవాహిక ద్వారా చేప ముల్లు గుండె వద్దకు చేరిందన్నారు. ఆమెకు వివిధ పరీక్షలు నిర్వహించి చేప ముల్లు గుండె దగ్గర చొచ్చుకుని ఉండడం గమనించామన్నారు. ఇది చాలా తరహాగా శస్త్ర చికిత్స చేసి తొలగాల్సిన ప్రక్రియ అంటూ ఆమె బంధువులకు వివరించామని అన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుండా, చాతీ ఎముకలకు నష్టం కలిగించకుండా సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకుని ఈమెకు గుండె వద్ద ఇరుక్కుని ఉన్న చేప ముల్లును తొడల దగ్గర నుంచి గొట్టం ద్వారా ట్రేపర్ ప్రొసీడర్ అనే విధానంలో చికిత్స నిర్వహించి చేప ముల్లును తొలగించామని చెప్పారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు శివరామకృష్ణ, నాగేశ్వరరావు, వంశీ చైతన్యలు తెలిపారు. శస్త్ర చికిత్స చేయించుకున్న మంగయ్యమ్మ కుమారుడు దీనికి సంబంధించిన కారణాలను వివరించారు. సుమారు పది రోజుల క్రితం తమ తల్లి మంగయ్యమ్మ సెల్ ఫోన్లో మాట్లాడుతూ చేప కూరతో భోజనం చేసిందన్నారు. అప్పుడు గొంతులో చేప ముల్లు ఇరుక్కుందని తెలిపిందన్నారు. కడుపుబ్బర (గ్యాస్టిక్) సమస్యలు ఉన్నాయనుకొని స్థానిక వైద్యులను కలిసి చెప్పగా వారు మందులు రాశారన్నారు. అయినా ఎంతకీ తగ్గకపోవడంతో ఆ వైద్యులు కాకినాడ అపోలో ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించాలని చెప్పడంతో తీసుకొచ్చామన్నారు. అపోలో ఆసుపత్రి వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించి చికిత్స చేస్తామని చెప్పగా తాము అంగీకరించినట్లు మంగయ్యమ్మ కుమారుడు చెప్పారు. కష్ట సాధ్యమైన శస్త్ర చికిత్సను నిర్వహించి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్యులను అపోలో ఆసుపత్రి సీఓఓ ఆర్ఆర్ రెడ్డి, సిబ్బంది అభినందించారు.






# మానవ మనుగడకు చెట్లే ఆధారం

## - ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం - కన్నతల్లిలాంటి పుడమి తల్లిని కాపాడుకుందాం - ప్రకృతిని ప్రేమిద్దాం : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్



**రామచంద్రపురం, (రాజధాని వార్తలు):** మానవుని మనుగడకు చెట్లే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు పెను ప్రమాదంగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రపురం మండలంలోని ఆదివారపుపేట గురుకుల పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ప్రపంచ పర్యావరణ దినోత్సావాన్ని పురస్కరించుకుని వన సంరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ఒక్కరోజే రికార్డు స్థాయిలో కోటి మొక్కలు నాటనున్నాట్టు తెలిపారు. వనమహోత్సవంలో ప్రతిఒక్కరం భాగస్వాములమై మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. మరల్ని భరిస్తున్న దరిత్రికి మొక్కలను నాటడమే మనమిచ్చే బహుమతి అని అన్నారు. చెట్లను కాపాడి వాటిని పరిరక్షిస్తామంటూ అధికారులతో ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఫారెస్ట్ అధికారి ఎం వి వి ప్రసాద్‌లు మాట్లాడుతూ మొక్కల పెంపకం, వన సంరక్షణ ఒక్కరోజు కార్యక్రమం కాదని ప్రతి నిత్యం చేయాల్సిన కార్యక్రమం అన్నారు. అడవులను పరిరక్షించుకుంటే అదే మన ప్రాణానికి జీవనాధారం ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్‌లు జి ఈశ్వరరావు, డి ఎస్ ఎన్ మూర్తి, ఎఫ్ ఎస్ ఓ నాగ సత్యనారాయణ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు యోగేంద్ర, దుర్గాప్రసాద్, ఎంపీడీవో పద్మజ్యోతి, డిప్యూటీ తాసిల్దార్ మాధురి, ద్రాక్షారామం సర్పంచి కొత్తపల్లి అరుణ, పలువురు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీ

**యానం, (రాజధాని వార్తలు):** పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు పురస్కరించుకుని మల్లాడి అభిమాన సంఘం, యూత్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక యర్ర గార్డెన్స్ నుండి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీలో యానాం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మల్లాడి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీని పుర వీధుల్లో హోరెత్తించారు. చింతా వారి వీధి నుండి త్యాగరాయ వీధి, పాత బస్టాండ్, మెట్టకుర్రు, గోపాల్ నగర్, కనకాలపేట, యు కె వి నగర్, భీమ్ నగర్, కురసంపేట, ఫరంపేట, మీదుగా సావిత్రి నగర్ గిరియంపేట తిరిగి ర్యాలీ యానాం చేరుకుంది. యువత ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి మల్లాడిపై అభిమానాన్ని చాటుకున్నారు. నిప్పులు చెరిగే ఎండన సైతం లెక్క చేయకుండా ర్యాలీలో యువత దూసుకుపోయారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమాన సంఘం ప్రతినిధులతో పాటు, పరిసర ప్రాంతాలకు చెందిన పరువు ప్రముఖులు, అభిమానులు, నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# 9 నుండి సంస్కృత శిక్షణ తరగతులు

**కాకినాడ, (రాజధాని వార్తలు):** సంస్కృత భారతి హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి ప్రవేశ సంస్కృత శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నాయని డాక్టర్ ఆచార్య రజిత తెలిపారు సంస్కృత భాష సంభాషణ శిక్షణ తరగతులు పూర్తి అయిన వారు ప్రవేశ క్లాసుకు అర్హులని ఆమె వివరించారు ప్రతిరోజు రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు ఆన్లైన్ క్లాసులు (జూమ్) నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరిగిందని ఈ కోర్సు సుమారు రెండు నెలల పాటు నిర్వహించబడుతుందన్నారు ఈ ప్రవేశానికి వయోపరిమితి లేదని ఫీజు కూడా లేదన్నారు ఆసక్తి ఉన్నవాళ్లు సంస్కృతంలో సంభాషించాలన్న అభిలాష కలిగిన వారు వాట్సాప్ గ్రూపులో జాయిన్ అవ్వాల్సిందిగా ఆమె కోరారు. క్లాస్‌కు వచ్చే వాళ్ళు మాత్రమే వాట్సాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు 77806 27034 లో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వన మహోత్సవ కార్యక్రమం

**కాకినాడ, (రాజధాని వార్తలు):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరించి జెఎన్ ఎయుకె ఎన్ఎస్ఎస్ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్, ఎస్సిసి యూనిట్ మరియు ఒన్టెప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ది. 05.06.2025 గురువారం ఉదయం జెఎన్ టియుకెలోని అలూమ్ని ఆడిటోరియం వద్ద వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గౌరవనీయులైన ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్కె.ప్రసాద్ మరియు యూనివర్శిటీ అధికారులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ఆకె.ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలను నాటడం ద్వారా పచ్చదనం మరింత పెంపొందుతుందన్నారు. అధిక సంఖ్యలో మొక్కలను నాటడం ద్వారా విశ్వవిద్యాలయ ప్రాంగణం అంతా పచ్చదనంతో కళకళలాడుతూ గ్రీన్ క్యాంపస్ గా విరాజిల్లుతుందన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటి రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని, మొక్కలు సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్తుతరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఓఎస్డి ప్రొ.డి.కోటేశ్వర రావు, డైరెక్టర్లు ప్రొ.జి.ఏసురత్నం, ప్రొ.ఎంహెచ్ఎం. కృష్ణప్రసాద్, ప్రొ.జి.పద్మజారాణి, ప్రొ.కె. రాము, ప్రొ.ఏఎస్ఎన్. చక్రవర్తి, ప్రొ.బి.టి.కృష్ణ, ప్రొ.ఏ.కృష్ణమోహన్, ప్రొ.ఏ.స్వర్ణకుమారి, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్రావు, మాజీ ఉపకులపతులు ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు, ప్రొ.కె.పద్మరాజు, ప్రొ.కెవిఎ. మురళీకృష్ణ, ఒన్టెప్ ప్రతినిధి రామకృష్ణ, ఎస్సిసి యూనిట్ కేర్ టేకర్ డా.టి.లక్ష్మణ కిశోర్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.రమణాజీ, ఎంవిఎస్వి.కిరణ్మయి, డా.పి.వీరలక్ష్మి, సీనియర్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



# కోవిడ్ 19 వైరస్ నిర్మూలనకు ఔషధం కనుక్కొన్న భారతీయ విద్యార్థి

**కాకినాడ, (రాజధాని వార్తలు):** పాండిచ్చేరి విశ్వ విద్యాలయానికి చెందిన ఒక భారతీయ విద్యార్థి కోవిడ్ 19 వైరస్ నిర్మూలనకు ఔషదం కనుక్కొన్నారు. డబ్ల్యూహెచ్ఓ కూడా దాన్ని అంగీకరించినది. ఒక టేబుల్ స్పూన్ నల్లమిరియాల పొడి, రెండు టేబుల్ స్పూన్ల తేనె మరియు కొంచెం అల్లం రసంతో చేర్చి క్రమంగా ఐదు రోజుల పాటు పాలతో సేవించితే కరోనా ప్రభావాన్ని తగ్గించడమే గాక 100% ఎలాంటి మందుల సహాయం లేకుండ సంపూర్ణ గుణముఖులవుతారు. ప్రపంచం పూర్తి ఈ చిట్కాను అనుసరించడం ప్రారంభించారు. ఈ సమాచారాన్ని మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు షేర్ చేయండి. ఉపయోగమవని.

# బ్యాచిలర్ లైఫ్‌కు స్వస్తి చెప్పిన అఖిల్



టాలీవుడ్ హీరో నాగార్జున కొడుకు అక్కినేని అఖిల్ తన బ్యాచిలర్ లైఫ్‌కు స్వస్తి చెప్తూ వివాహ బంధంలోకి అడుగు పెట్టాడు. శుక్రవారం తెల్లవారుఝామున మూడు గంటలకు వేద మంత్రాల సాక్షిగా అఖిల్ తన ప్రేయసి జైనబ్ మెడలో మూడు ముళ్లు వేశాడు. హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని నాగార్జున నివాసంలో వీరి పెళ్లి ఎంతో ఘనంగా జరిగింది. అయితే ఈ పెళ్లికి ఇరు కుటుంబ సభ్యులతో సహా అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. వారిలో మెగాస్టార్ చిరంజీవి- సురేఖ, రామ్ చరణ్- ఉపాసన దంపతులతో పాటూ డైరెక్టర్ ప్రశాంత్ నీల్, హీరో సుమంత్, శర్వానంద్ కూడా పెళ్లికి హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. పెళ్లి తర్వాత జరిగిన బరాత్‌లో హీరో నాగ చైతన్య ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నాడు. ప్రస్తుతం ఆ బరాత్‌కు సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. కాగా జూన్ 8న అక్కినేని కొత్త జంటకు అన్నపూర్ణ స్టూడియోలో గ్రాండ్‌గా రిసెప్షన్ ఏర్పాటు చేశాడు నాగార్జున. ఎంతో గ్రాండ్‌గా జరగనున్న ఈ రిసెప్షన్ కార్యక్రమానికి సినీ, రాజకీయ ప్రముఖులతో పాటూ పారిశ్రామికవేత్తలు కూడా హాజరుకానున్నారు.

గతేడాది నవంబర్‌లోనే అఖిల్- జైనబ్‌ల ఎంగేజ్‌మెంట్ జరిగినప్పటికీ అదే టైమ్‌లో నాగచైతన్య- శోభిత పెళ్లి పనులు మొదలవడంతో అఖిల్ పెళ్లిని వాయిదా వేశారు. హైదరాబాద్‌లోనే పుట్టిన జైనబ్ రవ్‌జీ ఓ ఆర్టిస్ట్. రిఫ్లెక్షన్ పేరుతో నిర్వహించిన ఓ పెయింట్ ఎగ్జిబిషన్ లో ఆమె వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శించారట. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్‌జీ కన్‌స్ట్రక్షన్ రంగంలో పెద్ద బిజినెస్ టైకూన్ అని సమాచారం.

# బ్లాక్ బోల్డ్ లుక్‌లో ఫరియా అబ్దుల్లా ఫైర్!



టాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ప్రస్తుతం గ్లామర్ వేదికపై హవా కొనసాగిస్తోంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. కేవలం కొన్ని గంటల్లోనే లక్షల మంది వీక్షించిన ఈ ఫోటోలు అభిమానుల మనసు దోచుకుంటున్నాయి. థర్స్‌డే స్పెషల్‌గా తీసిన ఈ ఫోటోషూట్‌లో ఫరియా వేసుకున్న బ్లాక్ డ్రెస్, లాంగ్ బూట్స్ స్టైలిష్ అవతారాన్ని ఆవిష్కరించాయి. ఈ పిక్స్‌లో ఆమె హుందాతనంతో పాటు గ్లామర్ ఫుల్ కూడా కనిపిస్తోంది. ఫొటోలు ఎంత ఫోకస్ అయితే, వాటి బ్యాక్‌డ్రాప్ అంత ఇంట్రస్టింగ్. ఓ గోడకట్టే స్టోరేజీ సెట్టింగ్‌లో బ్లాక్ డ్రస్సులో మెరిసిన ఫరియా, మేకప్ స్టైల్ నుంచి పోజింగ్ వరకు అన్నీ స్పెషల్‌గా కనిపించాయి. క్రేజీగా ఆమె పెట్టిన క్యాప్షన్ కూడా ఫ్రెండ్‌లీ టోన్‌తో ఉండటంతో, కామెంట్స్ సెక్షన్‌లో అభిమానులు బోలెడంత స్పందిస్తున్నారు. ఫరియా కెరీర్ విషయానికి వస్తే, మొదట జాతి రత్నాలు సినిమా ద్వారా పరిచయమై తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ అందుకున్న ఆమెకు ఫాలోయింగ్ పెరిగింది. ఆ తర్వాత 'లైక్, షేర్ & సబ్స్క్రైబ్', 'రావణాసుర' లాంటి సినిమాల్లో నటించి తనను తాను నటిగా నిరూపించుకుంది. ఈ మధ్యకాలంలో వెబ్ ప్రాజెక్ట్స్‌లోనూ కనిపించిన ఫరియా, ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంటోంది. పర్‌ఫార్మెన్స్‌తో పాటు స్టైలిష్ లుక్స్‌తో ఫాషన్ ఐకాన్‌గా మారుతున్న ఆమె వరుసగా గ్లామరస్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాలో అగ్రస్థానంలో నిలుస్తోంది. ఫరియా స్టైల్ స్టేట్‌మెంట్ ప్రస్తుతం ఫ్యాషన్ ఫీల్డ్‌లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న బ్లాక్ డ్రెస్, మ్యాచింగ్ బూట్స్ మరియు యూనిక్ హెయిర్ స్టైల్ వల్ల ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా మారింది. ప్రత్యేకంగా చెబితే, ట్రెడిషనల్, వెస్ట్రన్ స్టైల్స్ మిక్స్‌తో తనదైన శైలిని చూపించగలుగుతున్న అరుదైన తారగా ఫరియా నిలుస్తోంది. ఇదిలా ఉండగా, ఫరియా అబ్దుల్లా ప్రస్తుతం రెండు ప్రాజెక్ట్స్‌లో నటిస్తోందన్న టాక్ ఉంది. త్వరలోనే ఓ థ్రిల్లర్ మరియు ఓ కామెడీ మూవీలో ఆమె నటనను చూడొచ్చని టాలీవుడ్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# ప్రభాస్ సినిమా మీదే అమ్మడి ఆశలన్నీ..!



రెబల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమవుతుంది మళయాల భామ మాళవిక మోహనన్. ఇదివరకు తమిళ డబ్బింగ్ సినిమాలతో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ అమ్మడు డైరెక్ట్ తెలుగు సినిమా సైన్ చేసింది మాత్రం రాజా సాబ్‌తోనే. ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్‌తో ఛాన్స్ అంటే అమ్మడి దశ తిరిగినట్టే అనుకున్నారు. మారుతి డైరెక్షన్‌లో రాబోతున్న రాజా సాబ్ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ఇద్దరు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ బాగా వస్తుంది అన్న టాక్ అయితే ఉంది. ఐతే మళయాళంలో సినిమాలు చేస్తూ ఉన్నా కూడా మాళవికకు ఆశించిన రేంజ్‌లో స్టార్డం రాలేదు. స్టార్ మెటీరియల్‌కి ఏమాత్రం తగ్గని అమ్మడి అందానికి ఎందుకో ఆశించిన విధంగా లక్ కలిసి రావట్లేదు. అందుకే అమ్మడు ప్రస్తుతం తన హోప్స్ అన్నీ కూడా రాజా సాబ్ మీద పెట్టుకుంది. ప్రభాస్ సినిమా అంటే నేషనల్ లెవెల్‌లో బజ్ ఉంటుంది. సో ఈ సినిమా సక్సెస్ అయితే మాళవిక గురించి అందరు చర్చించే ఛాన్స్ ఉంటుంది. రాజా సాబ్‌తో పాటు అమ్మడు కోలీవుడ్ స్టార్ కార్తితో సర్దార్ 2 సినిమా చేస్తుంది అమ్మడు. అంతేకాదు మళయాళంలో కూడా హృదయపూర్వం అనే సినిమా చేస్తుంది అమ్మడు. రాబోతున్న సినిమాల్లో ప్రభాస్ రాజా సాబ్ ఒక్కటి హిట్ పడితే మాత్రం తప్పకుండా అమ్మడి ఫేట్ మారే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. ప్రభాస్ రాజా సాబ్ ఈ సమ్మర్ రిలీజ్ అనుకోగా అది కాస్త డిసెంబర్‌కి వాయిదా వేశారు. మారుతి మాత్రం ఈ సినిమా విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు.

థమన్ మ్యూజిక్ అందిస్తున్న రాజా సాబ్ సినిమా విషయంలో ప్రతిదీ చాలా స్పెషల్‌గా ఉం డబోతుందని తెలుస్తుంది. రాజా సాబ్ సినిమా నుంచి అప్డేట్స్ కోసం ప్రభాస్ ఫ్యాన్స్ ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే సినిమా నుంచి టీజర్ రాబోతుందని తెలుస్తుంది. సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్‌లు చాలా ఉన్నాయని అంటున్నారు. ఇన్నేళ్ల ఫ్యాన్స్ నిరీక్షణకు తప్పకుండా డబుల్ ట్రీట్ అందించేలా ఉంటుందని చిత్ర యూనిట్ గట్టి నమ్మకంతో చెబుతున్నారు.

# రామ్ చరణ్‌కి బుచ్చిబాబు చీకటే చూపిస్తున్నాడా?



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య పెద్ది తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తయింది. ఇందులో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ప్రధానంగా రామ్ చరణ్‌పై క్రీడా నేపథ్యం గల సన్నివేశాలను నైట్ షూట్ లో చిత్రీకరించారు. దాదాపు 20 రోజుల పాటు నిరవధికంగా రాత్రి పూట మాత్రమే షూటింగ్ జరిగింది. పగలంతా ఎలాంటి షూటింగ్ లేకుండా రాత్రి మాత్రమే చిత్రీకరించారు. దీంతో ఆ సన్నివేశాలకు ఎంతటి ప్రాధాన్యత ఉందన్నది అర్దమైంది. ఈ నేపథ్యంలో నైట్ సన్నివేశాల చిత్రీకరణ పూర్తయిందనుకున్నారంతా. కానీ తాజాగా మళ్లీ హైదరాబాద్‌లో ప్రారంభమైన కొత్త షెడ్యూల్ రాత్రిపూట షూటింగ్ చేస్తున్నారు. అందుకోసం ప్రత్యేకంగా కొన్ని సెట్లు కూడా నిర్మించారు. ఈ షెడ్యూల్‌లో కూడా రామ్ చరణ్ పై భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇదే షెడ్యూల్‌లో మరికొన్ని క్రీడా నేపథ్యంగల సన్నివేశాలు చిత్రీకరించాల్సి ఉందట. వారం పది రోజుల పాటు ఈ సన్నివేశాల చిత్రీకరణ సాగుతుందని సమాచారం. దీంతో సినిమాలో నైట్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలుస్తోంది. తొలి షెడ్యూల్ మొదలైంది. అక్కడ చరణ్, జాన్వీల పైపగటి పూట చిత్రీకరణ చేసారు. దీంతో చరణ్‌కి హైదరాబాద్ షూటింగ్ అంతా కొత్తగా అనిపిస్తుందిట. నటుడిగా ఈ సినిమా సరికొత్త అనుభూతిని పంచుతుంది అన్న ధీమాని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకూ చరణ్ చాలా సినిమాలు చేసారు. వాటిలో కొన్ని సినిమాల కోసం నైట్ షూట్‌లో కూడా పాల్గొన్నారు. కానీ ఆ రోజుల్ని వేళ మీద లెక్కపెట్టొచ్చు. బుచ్చిబాబు ఏకంగా నైట్ మాత్రమే ప్లాన్ చేసి షూట్ చేయడంతో? కథలో నైట్ సన్నివేశాల ప్రాధాన్యత అద్దం పడుతుంది.

# మోదీజీ 11 ఏళ్ల పాలనలో దేశం ఆర్థికంగా ముందడుగు, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు కొత్త శోభ



**- ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశం దశాబ్దాల నాటి సంకెళ్లను బద్దలు కొట్టింది - నరేంద్రుడి నాయకత్వంలో ఇప్పుడు ప్రపంచమే భారతదేశం వైపు చూస్తుంది - ప్రపంచం నలుదిక్కులా "నమో" మంత్రం ఒక్కటే నడుస్తుంది - ప్రధాని నేతృత్వంలో భారతీయ రైల్వేలకు మహర్దశ, వందే భారత్ ట్రైన్ నుండి నేడు ప్రారంభించనున్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెన వరకు అపూర్వరీతిలో అభివృద్ధి - భారతీయులు గర్వించదగ్గ గొప్ప నాయకుడు గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీజీ అంటూ కొనియాడిన రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీ.ఎం రమేష్**

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** భారతదేశంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రధాని నరేంద్రుడు అద్భుత సుపారీపాలన మొదలై 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ దేశంలో దశాబ్ద కాలం నాటి అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రస్తావించారు. దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం పేదరికం బారి నుంచి అనేక మందిని బయటకు తీసుకు వచ్చేందుకు అనేక పథకాలను అమలు చేసింది అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా సాధికారత, మౌలిక సదుపాయాలు, సమగ్రతపై దృష్టి సారించింది అని పీఎం ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల యోజన, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు గృహనిర్మాణం, శుభ్రమైన వంట ఇంధనం, బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణకు ప్రాప్యతను మెరుగుపరిచెలా. డిబిటి, డిజిటల్ సమగ్రత, గ్రామీణ మౌలిక సదుపాయాల ప్రోత్సాహం పారదర్శకతతో చివరి వ్యక్తి వరకు ప్రయోజనాల చేకూరేలా జరిగింది అన్నారు. మొక్కవోని వ్యక్తిత్వం, దేశం మీద ధర్మం మీద అమితమైన ప్రేమ ఆప్యాయత కలిగిన వ్యక్తి, సుపరిపాలన కొరకు నిత్యం శ్రమిస్తున్న గొప్ప నాయకుడు, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుడిగా, భారతీయులందరూ గర్వించదగ్గ నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు గావించిన మన గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనలో దేశం ఆర్థికంగా ముందడుగు వేసింది అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశం దశాబ్దాల నాటి సంకెళ్లను బద్దలు కొట్టింది అని ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా భారతదేశం ఉంది అని చెప్పడానికి గర్వంగా ఉందని పేర్కొన్నారు. మన నరేంద్రుడి నాయకత్వంలో ఇప్పుడు ప్రపంచమే భారతదేశం వైపు చూస్తుంది అని ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం యొక్క శక్తి ప్రపంచానికి తెలిసిందని ఇప్పుడు ప్రపంచం నలుదిక్కులా నమో మంత్రం ఒక్కటే నడుస్తుంది అని కొనియాడారు.ప్రధానమంత్రి గత 11 సంవత్సరాలుగా రైల్వే మౌలిక సదుపాయాలను అపూర్వ రీతిలో అభివృద్ధి చేశారు. వందేభారత్, నమోభారత్, అమృత్భారత్ వంటి కొత్త తరం రైళ్లను ప్రధాని ప్రవేశపెట్టారు. ఈ ప్రయత్నాల ద్వారా మన దేశంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రైల్వే సౌకర్యవంతమైన, సమర్థవంతమైన ప్రయాణం సాధ్యమైందన్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి జమ్మూ కాశ్మీర్‌లో చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనను ప్రారంభిస్తున్న మోదీజీ గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.కాశీ విశ్వనాథ్ కారిడార్ నుండి రామ మందిరం వరకు, ప్రాచీన పుణ్యక్షేత్రాలు పునరుద్ధరించారు.ఈ చర్యలతో భారతీయ చరిత్ర, ఆధ్యాత్మికత, సంస్కృతికి కొత్త జీవం అందించడమే కాకుండా, పర్యాటకుల సంఖ్యను పెంచి, దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు





**మైలవరం, (రాజధాని వార్తలు):** కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వితీయ శ్రేణి శాఖా గ్రంథాలయం మైలవరం నందు వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎల్‌బిఆర్‌సి గ్రంథపాలకుడు డా.టి.సాంబశివరావు, విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు మరియు దాసు విద్యార్థులను ఉద్దేశించి కొన్ని ముఖ్యమైన సందేశాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులందరూ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని అన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి విద్యార్థికి ఒక పుస్తకం, ప్రతి పుస్తకానికి ఒక విద్యార్థి ఉంటాడని అన్నారు. తదుపరి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంస పత్రాలు మరియు బహుమతి ప్రధానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠకులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# వార్డెన్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుండి ధరఖాస్తులు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల లో 2025-2026 విద్యాసంవత్సరము నుండి టైప్ IV కేజీబివి బాలికల హాస్టల్స్ ప్రారంభించుటకు గెస్ట్ ప్రాతిపదికన పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్, వార్డెన్ పోస్టులకు అర్హత గల అభ్యర్థులను నింపుటకు ధరఖాస్తులను కోరుతున్నట్లు సమగ్ర శిక్ష, అదనపు పథక సమన్వయకర్త ఆర్.జయప్రకాష్ తెలిపారు. జిల్లాలో నాతవరం మండలం జెడ్.పి.హెచ్.ఎస్. డి.ఎర్రవరం, జెడ్.పి.హెచ్.ఎస్. కె.కోటపాడు, ఎస్. రాయవరం మండలం జెడ్.పి.హెచ్.ఎస్. దార్లపూడి, జెడ్.పి.హెచ్.ఎస్. రాంబిల్లి, జెడ్.పి.హెచ్.ఎస్. వి. మాడుగుల, జి.హెచ్.ఎస్.సబ్బవరం పాఠశాలలో ఒక్కొక్కటి చొప్పున గల పార్ట్ టైమ్ ఇనస్ట్రక్టర్, వార్డెన్ పోస్టులకు అర్హత గల అభ్యర్థులనుండి ధరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. మరియు తేది:23.09.2024 నోటిఫికేషన్ ప్రకారము ధరఖాస్తు చేసుకొని రెగ్యులర్ ప్రాతిపదికన సెలక్ట్ కాబడని అభ్యర్థులు కూడా వారి అంగీకారము తెలుపుతూ అదనపు పథక సమన్వయకర్త, సమగ్ర శిక్ష, అనకాపల్లి వారి కార్యాలయ పనిదినములలో తేది: 10.06.2025 లోగా ధరఖాస్తు సమర్పించవలసినదిగా కోరడమైనదన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు వెంటనే ఉత్తర్వులు నెలకు పది వేల రూపాయలు (రూ.10,000/-) గౌరవ వేతనము ఇవ్వబడునని తెలిపారు. ఈ పోస్టులకు విద్యార్హతలు పార్ట్ టైమ్ టీచర్‌కు గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుండి బ్యాచిలర్ డిగ్రీ బి.ఎస్.సి మాథ్స్, మరియు యుజిసి గుర్తింపు యూనివర్సిటీ బి.ఈడి/ఎం. ఏ. ఎడ్యుకేషన్, ఎన్. సి. టి 2 పొందియుండాలని తెలిపారు. వార్డెన్ పోస్టులకు గుర్తింపుపొందిన యూనివర్శిటీ నుండి బ్యాచిలర్ డిగ్రీ, బి. ఈడి / ఎం ఎ ఎడ్యుకేషన్ కలిగి ఉండి, తేది.01.07.2025 నాటికి ఒ.సి. అభ్యర్థులకు 42 సంవత్సరాలు, ఎస్.సి., ఎస్.టి., ఒబిసి, ఇబిసిలకు 47, విభిన్న ప్రతిభావంతులకు 52 వయస్సు గల అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలియజేసారు.

# చిరు వ్యాపారులకు న్యాయం చేయండి

**- దుకాణాలు పోయిన వ్యాపారులు అప్పుల ఊబిలో.. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి : చింతపల్లి సర్పంచ్ పుష్పలత**




**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చిరు వ్యాపారులు తమ జీవనాధారాన్ని కోల్పోవడం దురదృష్టకరమని చింతపల్లి గ్రామ సర్పంచ్ దురియా పుష్పలత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పుడు ప్రభుత్వం చిన్న వ్యాపారులపై దయ చూపాల్సిన సమయం. చిన్న వ్యాపారంతో తమ పూట గడుపుతున్న వారికి నష్టం కలిగించడం సమంజసం కాదు" అని పేర్కొన్నారు. ప్రభుత్వ చిన్నపాటి దుకాణాలను తొలగించిన తీరును ఆమె తీవ్రంగా ఖండించారు. దుకాణాలు కోల్పోయిన చిరు వ్యాపారులు కుటుంబాలతో పాటు రోడ్డుపై పడిపోయిన పరిస్థితి ఎదుర్కొంటున్నారని, పలువురు అప్పుల ఊబిలో చిక్కుకొని తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని, వారికి తక్షణమే న్యాయమైన పరిహారం అందించాల్సిందిగా ప్రభుత్వంను కోరారు.

# దుకాణాలు తొలగింపు.. చిన్న వ్యాపారుల ఆవేదన

**- కొలతల్లో తారతమ్యం అన్యాయం : జెడ్పిటిసి బాలయ్య ఆరోపణ - విస్తరణపై వ్యాపారుల నిరసన బైఠాయింపు - తక్షణ పరిహారం కోరుతూ డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం**





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** బ్రిటిష్ కాలం నుంచి చింతపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలతో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు.. రహదారి విస్తరణ పనుల పేరిట తమ దుకాణాలను కోల్పోయిన ఆవేదనతో రోడ్డెక్కారు. అల్లూరి జిల్లా యంత్రాంగం చేపట్టిన విస్తరణలో భాగంగా తమ దుకాణాలు తొలగించబడటంతో జీవనాధారం కోల్పోయామని బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో స్థానిక జెడ్పిటిసి పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో వ్యాపారులు చింతపల్లి ప్రధాన రహదారిలో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ "సుమారు 250 కుటుంబాలు ఈ షాపులపై ఆధారపడి జీవిస్తున్నారు. విస్తరణ పనుల్లో అన్యాయంగా కొన్నిచోట్ల పలుకుబడి ఉన్నవారి వద్ద కొలతలు తగ్గించి, పలుకుబడి లేని వారి వద్ద పెంచడం తగదు. అందరికీ సమాన హక్కులు ఉండే చింతపల్లిలో ఈ విధమైన తేడాలు అంగీకరించదగినవి కావు," అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చింతపల్లి పోలీస్ స్టేషన్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు 120 అడుగులు, పోలీస్ స్టేషన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు 100 అడుగుల మేర విస్తరణ చేపడుతున్నట్టు వివరించారు. కొలతల విషయంలో తారతమ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. పెద్ద సంఖ్యలో దుకాణదారులు, మహిళలు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ప్రకటించి, న్యాయంగా కొలతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు నాయకులు దురియ హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, జల్లి సుధాకర్, నూరు సాహెబ్ గ్రామ పెద్ద బేతాళుడు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ శ్రేణులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం

**- అనకాపల్లి పట్టణం, స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహణ**
**- అనకాపల్లి నియోజకవర్గ ప్రజల వినతులను తీసుకొని స్వయంగా అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేసిన రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర**





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి పట్టణం, స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ & ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ సూచనల మేరకు శుక్రవారం నాడు ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో వారు 82వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ పోలారపు త్రినాధ్ మరియు తదితరులు పాల్గొని టీడీపీ శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan